



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

# విఠలాచార్య

( విజయచిత్ర, 1969, మే, సంచిక నుంచి)



విఠలాచార్య సనాతన కుటుంబంలోంచి వచ్చిన వ్యక్తి. ఆయన స్వస్థలం, జన్మస్థలం ఉడిపి. మాతృభాష కన్నడం. 1920 వ సంవత్సరంలో జనవరి 28 న ఆయన పుట్టారు.

ఉడిపిలోనే విఠలాచార్య విద్యాభ్యాసం సాగింది. రాజుల కధలూ, మాంత్రికుడి కధలూ వినడానికి ఆ అబ్బాయి అప్పుడు ఎంతో కుతూహలం చూపేవాడు. నేటి ఆయన చిత్ర నిర్మాణానికి ఆ విధంగా నాడే పునాది పడి వుంటుంది! చరిత్ర పుస్తకాలు చదవడం అతనికి అలవాటయింది.

ఆ అలవాటు నేటికీ వుంది. ఆయన లైబ్రరీలో ఇవాళ, దాదాపు మూడువేల పుస్తకాలున్నాయి. ఈ మూడు వేల పుస్తకాలూ ఆ కోవకు చెందినవే.

అయితే విఠలాచార్యకు చదువు మీద శ్రద్ధకలగలేదు. అతని చదువు ఒకటోఫారం మధ్య దాకా వచ్చి ఆగిపోయింది. 'ఈ చదువూ, ఈ బడీ బోరు.' అనుకుని 'జోరు' గా తిరగడం సాగించాడు. 'ఈ వూరు విడిచి పెట్టి ఎక్కడికైనా పోవాలి; కష్టపడి ఏదైనా పని చెయ్యాలి' అనుకున్నాడతను. ఆ వూహతో, కట్టుకున్న గుడ్డలతో బయల్దేరాడు – ఉడిపి నుంచి. ఎక్కడికి పోవాలి? అనుకున్నాడు మళ్ళీ. 'అరిసికర్రై' అనే వూళ్ళో అతని అన్నగారు హోటలు నడుపుతున్నారు. అక్కడికి పోదాం అని కాలు సారించాడు. అయితే ఆ వూరు అక్కడికి ఎంత దూరమో, ఎలా వెళ్ళాలో ఏ విషయాలూ అతనికి తెలియవు. తీరా చూస్తే నూటయాభైమైళ్ళ దూరం వుంది. చిత్రం ఏమిటంటే – జానపదంలోని రాజకుమారుడిలా, విఠలాచార్య మధ్య మధ్య మజిలీలు చేస్తూ ఆ నూటయాభైమైళ్ళూ కాలినడకన పూర్తి చేశాడు; అప్పుడు

అతని వయస్సు తొమ్మిది సంవత్సరాలు.

అన్నగారి హోటలు వ్యాపారంలో చేరి, విఠలాచార్య కష్టపడి పని చేసి, పెద్దవాడైనాడు. అరిసికరై దగ్గర ఒక కొండ వున్నది. ఆ కొండ మీద వెంకటేశ్వరాలయం వుంది. దానికి 'మాలెకల్లు తిరుపతి' అని పేరు. అక్కడినుంచి, అసలు తిరుపతికి, భూమిలోంచి సొరంగ మార్గం వున్నదని ఒక నమ్మకం కూడా వుంది. విఠలాచార్య ఆ వూరు వస్తూనే, ఆ వెంకటేశ్వర ఆలయానికి వెళ్ళి – "స్వామీ ! తుండుగుడ్డతో ఈ వూరు వచ్చాను. నన్ను పెద్దవాడిని చేసి, ఐశ్వర్యం ఇస్తావో, ఇలాగే వుంచుతావో నీదే భారం" అని ప్రార్థించాడు.

హోటలు వ్యాపారంలో విఠలాచార్య లక్ష్మీదేవి అనుగ్రహం పొందాడు. అన్నగారితో పాటు అతనికీ ఐశ్వర్యం కలిసొచ్చింది. (ఆ నమ్మకంతోనే ఆయన, అరిసికరైలో వున్న వెంకటేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళే కొండదారిలో వున్న ఎలక్ట్రిక్ దీపాల ఖర్చును చాలా కాలం నుంచి భరిస్తున్నారు. ఆ ఆలయంలో కల్యాణ మంటపం కూడా ఆయన నిర్మించారు.)

ఆ వూళ్ళో వుంటూనే, విఠలాచార్య నాటకాల్లో వేషాలు వెయ్యడం ఆరంభించారు. కత్తిసామూ, గరిడీ, కుస్తీలూ నేర్చుకున్నారు. అనేక కుస్తీ ప్రదర్శనాలలో పాల్గొని, బహుమతులు పొందారు.

1938లో విఠలాచార్య జాతీయోద్యమంలో పాల్గొని, మూడు సార్లు జైలు శిక్ష అనుభవించారు. దాదాపు ఐదు సంవత్సరాలు పాటు, రాజకీయాల్లో ముమ్మరంగా తిరిగిన తర్వాత, 1943 లో తిరిగి వ్యాపారంలో పడ్డారు. అయితే ఈ సారి వ్యాపారం సినిమాలకు సంబంధించినది. కొంత మంది దగ్గర స్నేహితులతో కలిసి, టూరింగ్ టాకీస్ నడపసాగారు. మూడు సంవత్సరాలు ఆ వ్యాపారం నడిపిన తర్వాత, ఆ మిత్రులూ ఆయనా కలిసి – 'మాహాత్మా పిక్చర్స్' అన్న సినిమా నిర్మాణ సంస్థను స్థాపించి – శ్రీనివాస కల్యాణం, సౌభాగ్యలక్ష్మీ మొదలైన ఏడు కన్నడ చిత్రాలను నిర్మించారు. విఠలాచార్య ఆ చిత్రాలకు నిర్మాత. మూడు, నాలుగు చిత్రాల్లో ఆయన హాస్యపాత్రలు కూడా ధరించారు.

నేటి దర్శకుడయిన జి. విశ్వనాథం అప్పుడు ఎడిటర్ గా వుండేవారు; దరిమిలా ఒక చిత్రాన్ని డైరక్టు చేశారు – ఆ చిత్రం వందరోజులు ఆడింది. అది పురస్కరించుకుని, ఆ సంస్థ వారు విశ్వనాధాన్ని ఇంకో చిత్రం కూడా డైరక్టు చెయ్యమన్నారు. అయితే, ఎందుకనో ఆయన వున్నట్టుండి ఎక్కడికో అడ్రస్ చెప్పకుండా పరారీ అయిపోయాడు. దాంతో, జరుగుతున్న జాగును భరించలేక, విఠలాచార్య, తానే దర్శకత్వాన్ని చేపట్టవలసి వచ్చింది. ఆ విధంగా ఆయన దర్శకుడిగా రూపొందారు.

అయితే కన్నడ చిత్రాలు ఎంత కష్టపడి తీసినా ఆటే లాభాలు సంపాయించేవి కావు. పైగా, అంతకంటె భారీగా వచ్చే తెలుగు, తమిళ చిత్రాల తాకిడి ఒకటి. ఈ కారణంగా విఠలాచార్య, కన్నడ చిత్ర నిర్మాణాన్ని విడిచి పెట్టి, తెలుగు చిత్రాలు తియ్యాలనుకున్నారు. తెలుగు చిత్రాలు తియ్యడానికి ఇంకో కారణం కూడా వుందని విఠలాచార్య చెబుతారు.

ఒక పెద్ద జ్యోతిష్కుడి దగ్గరకు వెళ్ళి ఆయన రెండు ప్రశ్నలు అడిగారట.

1. ప్రస్తుతం నాకు దాదాపు రెండు లక్షల రూపాయలు అప్పుంది. అది తీరిపోతుందా? ఎన్నాళ్ళలో?
2. నేను లాభాలు సంపాయించాలంటే ఏ వ్యాపారం చెయ్యాలి?

ఈ రెండు ప్రశ్నలకూ జ్యోతిష్కుడు ఇచ్చిన సమాధానాలు ఏమిటంటే – రెండేళ్ళలో ఆ అప్పులు తీరిపోతాయనీ, పరభాషా చిత్రాలు తీస్తే లాభాలు వస్తాయనీ. జ్యోతిష్కుడు చెప్పినట్టే, రెండేళ్ళలో ఆయన అప్పులు తీరిపోయాయి. పరభాషా చిత్రాలు తియ్యాలన్న ఉద్దేశంతో కూడా తెలుగు చిత్రాల నిర్మాణానికి ఉపక్రమించారు.

1953 లో విఠల్ ప్రొడక్షన్స్ పేరిట విఠలాచార్య దర్శక, నిర్మాతగా తెలుగు చిత్రాల నిర్మాణం ఆరంభించారు. తెలుగులో తీసిన ఆయన మొదటి చిత్రం – 'కన్యాదానం'. ఆ చిత్రం తీసేనాటికి విఠలాచార్యకు తెలుగు అసలు రాదు. (ఈ రోజున ఆయన దగ్గర వున్న పుస్తకాల్లో తెలుగు పుస్తకాలు ఎక్కువ – తెలుగు క్షుణ్ణంగా మాట్లాడతారు!)

తర్వాత ఆ సంస్థ విఠల్ కంబైన్స్ గా మారింది. రెండు సంస్థల పేరిటా మొత్తం 17 చిత్రాలు నిర్మించారు. ఏ రెండు, మూడు చిత్రాలో తప్ప ఈ చిత్రాలన్నీ మంచి లాభాలు తెచ్చిపెట్టాయి. ఇంతవరకూ ఆయన 33 చిత్రాలను డైరక్టు చేశారు! ఇన్ని చిత్రాలను డైరక్టు చెయ్యడం కూడా ఘనతే ! ఇందులో ఒక తమిళ చిత్రం, కొన్ని కన్నడ చిత్రాలూ, ఎక్కువ తెలుగు చిత్రాలూ వున్నాయి.

ప్రస్తుతం ఆయన గండికోటరహస్యం, (ఈ నెల విడుదల) కదలడు – వదలడు, పి.యస్.ఆర్, గౌతమీ, కె. జి. ఆర్, విఠల్ కంబైన్స్ వారి చిత్రాలను డైరక్టు చేస్తున్నారు. ఇవన్నీ జానపదాలే. విఠలాచార్యగారికి ఎనమండుగురు సంతానం. నలుగురు అబ్బాయిలూ, నలుగురు అమ్మాయిలూ. పెద్దబ్బాయి – బి. వి. శ్రీనివాస్ – దర్శకుడిగా వుంటున్నాడు. తతిమ్మా అబ్బాయిలు చదువుకుంటున్నారు.

"నా విజయ రహస్యం ఏమిటంటే – అన్ని రసాలూ గల కథను చకచకా చెప్పడం. నా దృష్టిలో సినిమాలో ముఖ్యమైనవి మూడు రసాలు – కరుణ, హాస్యం, శౌర్యం" అన్నారు విఠలాచార్య. ఆయన స్వశక్తిమీద పైకి వచ్చిన మనిషి. కష్టపడి పని చెయ్యడం, హృదయపూర్వకంగా పని చెయ్యడం – అన్న అంశాలు ఆయన జీవిత కథలో ప్రధానంగా కనిపించే అంశాలు.

"నేను మద్రాసు వచ్చిన మొదట్లో వాహిని స్టూడియోలో కన్నడ చిత్రాలు తీసినప్పుడు, శ్రీ నాగిరెడ్డిగారు చాలా సహాయం చేశారు. కన్నడ చిత్రాల నిర్మాణానికి ఖర్చు ఎక్కువ అవుతోందని అంటే – స్టూడియో అద్దె చాలా తగ్గించి, అనేక సదుపాయాలు కలిగించారు. అలాగే శ్రీ సుందర్ లాల్ గారు కూడా నాకు సహాయ పడ్డారు" అన్నారు విఠలాచార్య.

1972 లో ఆయన సొంత స్టూడియోను ప్రారంభిస్తారు. "అప్పుడు రెండు రకాల చిత్రాలనూ నిర్మించాలన్న ఉద్దేశం నాకు వున్నది. ఇటు 'బాక్సాఫీస్' చిత్రాలూ, అటూ ప్రయోగాత్మక చిత్రాలూ నిర్మించగలిగే స్తోమత, తాహతు అప్పుడు లభించగలవని నేను అనుకుంటున్నాను" అని చెప్పారు విఠలాచార్య.

★★★

## వచ్చేనెల మరో ఫ్లాష్ బ్యాక్

COMMENTS